క్లుప్తంగా

ఉచితంగా ఇసుక పంపిణీ

జూలూరుపాడు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తుందని జూలూరుపాడు ఎంపీడీఓ తాళ్లూరి రవి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉచితంగా ఇసుక పర్మిషన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి 40 టన్నుల ఇసుక ఇవ్వనున్నట్లు చెప్పారు. రవాణా ఖర్చులు లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందన్నారు. జూలూరుపాడు మండల వ్యాప్తంగా మొదటి విడతలో మంజూరైన 530 ఇందిరమ్మ ఇళ్లకు, 459 ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడం జరిగిందని, నిర్మాణాలు వివిధ దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు మట్టి కోసం తహసీల్దార్ పేరు మీద ఒక్కో ట్రాక్టర్ టక్కుకు రూ.500 చొప్పున చలానా తీయాలని లబ్ధిదారులకు సూచించారు.

రేపు లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ

జూలూరుపాడు: 14న కొత్తగూడెంలో జరగనున్న లంబాడీల ఆత్మగౌరవ మహార్యాలీని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు లకావత్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీని జయప్రదం చేసేందుకు విద్యార్థులు, యువత, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో హలావత్ రఘు, మూడు రమేష్, జోధా బాయి, నరేష్, నాగరాజు, వీరభద్రం, లక్ష్మి, రవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

సుజాతనగర్: కేంద్రం అమలు చేస్తున్న బీమా పథకాలపై అవగాహన ఉండాలని సింగభూపాలెం ఎస్‌బీఐ మేనేజర్ బాలగోపాల్ అన్నారు. సర్వారం గ్రామంలో బ్యాంకు ఆధ్వర్యంలో జీవన్‌జ్యోతి, జీవన్ బీమా, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన తదితర బీమా పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మాట్లాడుతూ ప్రజలు, రైతులు బ్యాంకులు అందించే పథకాల ద్వారా రుణాలు పొంది సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ భాను పద్మశ్రీ, సెక్రటరీ సతీష్, భూక్యా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగబిషన్ బస్తీ, ఫ్యూన్ బస్తీ, ఏపీహెచ్ బస్తీ, రామవరం, 2 ఇంక్‌లైన్, గరిమెళ్లపాడు, ఎస్సీబీ నగర్, చిట్టి రామవరం, బాబూ క్యాంప్, సన్యాసి బస్తీ, మధుర బస్తీ, పోస్టాఫీస్ ఏరియా, గొల్లగూడెం, బస్టాండ్ సెంటర్, బర్లీఫిట్, బర్మా క్యాంపు, విద్యానగర్, రాంనగర్, రామాంజనేయ, వెంకటేశ్వర, వికలాంగుల, గాంధీకాలనీ, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాల్వంచరూరల్: యానంబైల్ 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిన్నెరసాని, కోడిపుంజలవాగు, పూసలతండా, రెడ్డిగూడెం, ఉల్వనూరు పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.


నూతన కమిటీ ఎన్నిక

ఇల్లెందు: ఇల్లెందు పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అవుదుర్తి నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నిలుగొండ రాజు, సహాయ కార్యదర్శిగా నడిగోటి కోటి, కోశాధికారిగా రాచమల్ల వెంకటేశ్వర్లు, ఇద్దరు కార్యదర్శ సభ్యులను ఎన్నుకున్నారు.

మార్కెట్ యార్డ్ నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

జూలూరుపాడు: మండల కేంద్రంలో శాశ్వత వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడాన్ని హర్షిసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హమాలీలు, కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, వ్యవసాయ మార్కెట్ సాధన కమిటీ కన్వీనర్ వేల్పుల నరసింహారావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా శాశ్వత మార్కెట్ యార్డు కోసం ఎదురుచూస్తున్న హమాలీలు, రైతులు కల సాకారమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.3.03 కోట్లు మంజూరు చేయడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, లకావత్ లచ్చు, దుద్దుకూరి సుమంత్, రామకృష్ణ, పోతురాజు నాగరాజు, రాంశెట్టి నాగేశ్వరరావు, పణితి జగన్నాథం, మెంతుల కృష్ణ, బాలాజీ, హమాలీ మేస్త్రీలు పాల్గొన్నారు.

గ్రామాలకు మహర్దశ

విద్యానగర్ పంచాయతీ కార్యాలయం

పల్లె పాలనపై కేంద్రం నజర్
- సమర్థ్ పంచాయత్ వెబ్‌పోర్టల్ ప్రారంభం
- ఆర్థిక వనరుల పెంపుదలపై ప్రత్యేక దృష్టి
- గ్రామ పరిపాలనలో మరింత పారదర్శకత

చుంచుపల్లి: గ్రామ పంచాయతీల ఆదాయ వనరులు డిజిటల్ వేదిక ద్వారా పర్యవేక్షిస్తూ ఆర్థిక నిర్వహణను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సమర్థ్ పంచాయత్ వెబ్‌పోర్టల్‌ను తాజాగా ప్రారంభించింది. ప్రస్తుతం పన్నులు, పన్నేతర ఆదాయాలు గ్రామాలకు పరిమితంగా సమకూరుతున్నాయి. వీటిని సాధారణ నిధి (జనరల్ ఫండ్) కింద పంచాయతీలు జమ చేస్తున్నాయి. ఇవి కాకుండా జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలు నిధులిస్తున్నాయి. అవి సకాలంలో విడుదలవక నిర్వహణ, అభివృద్ధి, వేతనాల చెల్లింపులకు నిధుల కొరత ఏర్పడుతోంది. వీటన్నింటినీ సమీక్షించిన కేంద్రం పంచాయతీల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సన్నద్ధమైంది. ఆదాయ సేకరణను డిజిటలీకరించి వాటి చెల్లింపులను సులభతరం చేయడంతో పాటు భవిష్యత్‌లో వనరుల పెంపుదలకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించేందుకు వీలుగా సమర్థ్ పంచాయత్ విధానం తేవాలని నిర్ణయించింది. ఇందులో ముందుగా హిమాచలప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ పైలట్ రాష్ట్రాల్లో ప్రాజెక్టు చేపట్టింది. అక్కడ ఆదాయ వనరుల పెరుగుదలతో పాటు చెల్లింపులు మెరుగయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా దీనిని మరింత అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించింది. మున్ముందు అవసరమైతే తామిచ్చే గ్రాంట్లను కేంద్రం నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసేందుకు ఈ పోర్టల్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉన్నట్లు ఉంది.

మండలంలో 18 పంచాయతీలు..

ప్రభుత్వం గ్రామపంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సమర్థ్ పంచాయత్ వెబ్ పోర్టల్‌ను తెచ్చింది. ఈ డిజిటల్ వేదిక ద్వారా నేరుగా గ్రామ పంచాయతీలను పర్యవేక్షించడమే కాకుండా బలోపేతానికి అవసరమైన సూచనలు, సలహాలు అందివ్వనుంది. చుంచుపల్లి మండలంలో విద్యానగర్ కాలనీ, బాబూక్యాంపు, నందాతండా, వెంకటేశ్వరకాలనీ, రాంపురం, రుద్రంపూర్, పెనుబల్లి, వెంకటేష్‌ఖని, పెనగడప, అంబేడ్కర్‌నగర్ కాలనీ, ప్రశాంతినగర్, చుంచుపల్లితండా, గౌతంపూర్, రామాంజనేయ కాలనీ, ఎన్‌కే నగర్, 3 ఇంక్‌లైన్, 4 ఇంక్‌లైన్, ధన్‌బాద్ 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం వీటికి రెండు విధాలుగా ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. ఒక్కో పంచాయతీకి జనాభాను బట్టి రూ.2 లక్షల నుంచి 6 లక్షల వరకు ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తుంటారు. పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా సాధారణ నిధి (జనరల్ ఫండ్) సమకూరుతుండగా జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సంఘం నిధులు అందుతున్నాయి.

అయితే ప్రస్తుతం స్థానిక సంస్థల పాలకుల పదవీకాలం ముగిసి నందున ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీల నిర్వహణ, సిబ్బందికి వేతనాల చెల్లింపు తదితర అంశాల్లో నిధులు కొరత వేధిస్తోంది. కేవలం సాధారణ నిధులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. కేంద్రం పంచాయతీలకు కేటాయించిన నిధులను రాష్ట్రాలు ఇతర పనులకు మళ్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని కేంద్రం తాను అందజేస్తున్న నిధులు నేరుగా పంచాయతీలకే చేరే విధంగా చర్యలు తీసు కోవాలని భావిస్తోంది. అందుకే సమర్థ్ పంచాయత్ వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా ఆయా గ్రామ పంచాయతీల వాస్తవ పరిస్థితులు ఏంటన్న విషయాల్ని తెలుసుకోవడమే కాకుండా ఆర్థికంగా బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టనుంది. అంతేకాకుండా పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెరుగుదల కోసం ఆచరణీయ ఆర్థిక నమూనాను రూపొందించేందుకు పంచాయతీరాజ్ నిపుణులతో అధ్యయన కమిటీని నియమించింది. వీటన్నింటి కారణంగా రాబోయే రోజుల్లో గ్రామ పంచాయతీలకు ఆర్థికంగా మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది.

ఆదివాసీల జోలికొస్తే ఊరుకోం..



మాట్లాడుతున్న బాలరాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆదివాసీ నాయకులు, ప్రజాప్రతినిధుల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని ఆధార్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి పాడియం బాలరాజు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం జరిగిన ఆదివాసీ సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధానంగా తెల్లం వెంకట్రావు, సోయం బాపూరావులపై లంబాడీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఏదైనా ఉంటే సుప్రీంకోర్టులో చూసుకోవాలన్నారు. ఎస్టీల జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆదివాసీలు ప్రతీ గూడేన్ని చైతన్య పరుస్తూ దొర, పటేల్ ఆధ్వర్యంలో జోడే ఘాట్ యుద్ధక్షేత్రాలుగా మార్చడానికి అన్ని ఆదివాసీ సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. అన్ని మండల కేంద్రాలలో స్థానిక ప్రభుత్వ అధికారులకు లంబాడీల తొలగింపు అంశంపై వినతిపత్రాలు ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. డి.రమేష్, ఈసం సురేష్, బి.రామనాథం, టి.నరసింహారావు, వి.శ్రీకాంత్, కె.రాంప్రసాద్, ఎం.రాజు, జి.వెంకటేశ్వర్లు, పి.సుధీర్, పి.లక్ష్మీనర్సు, ఎస్.నరసింహారావు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు అన్నారు. కొమరారం, రొంపేడు పీహెచ్‌సీలను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రులలో మందుల నిల్వ కేంద్రాన్ని, రోజువారీ ఓపీ, సిబ్బంది హాజరు తదితర వివరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని స్వయంగా పరామర్శించి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాలలో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అవసరమైన గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..



టేకులపల్లి పీఎంహెచ్ బాలికల హాస్టల్ వద్ద సమ్మె చేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్లు

టేకులపల్లి: గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో టేకులపల్లిలోని పీఎంహెచ్ బాలికలు, బాలుర హాస్టళ్ల ఔట్ సోర్సింగ్ వర్కర్ల నిరవధిక సమ్మెను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. తమకు క్యాటరింగ్ జీఓ 527 రద్దు చేయాలని, జీఓ 60 ప్రకారం రూ.15,600 జీతం, 10 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ కార్మికులు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా నాయకులు ఈసం పద్మ, కుంజా జయ, ఈసం స్వరూప, అంజమ్మ, అనిత, విజయభారతి, సుబ్రహ్మణ్యం, తాటి భారతి, టి.సుజాత, కిషన్, సుధ, విజయ, భద్రమ్మ, రామలక్ష్మి, శైలజ, దీప పాల్గొన్నారు.

జాయింట్ సర్వే కోసం రైతుల పట్టు

ఇల్లెందురూరల్: నిర్వాసితుల ఉపాధిపై నీళ్లు చల్లుతూ రెవెన్యూ, అటవీశాఖ అధికారుల తీరుపై నిర్వాసితులు భగ్గుమన్నారు. అసలు భూమి ఏ ప్రభుత్వ శాఖ పరిధిలో ఉందో స్పష్టత ఇవ్వకుండా భూమి అప్పగింతపై తమ అభిప్రాయం అడగటమేమిటని రైతులు ప్రశ్నించారు. దీంతో చేసేది లేక అధికారులు గ్రామసభ వీడి వెళ్లిపోయారు. మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీలో జేకే ఓసీ విస్తరణ ప్రాజెక్టులో భాగంగా అటవీ భూమిని సింగరేణికి అప్పగించేందుకు శుక్రవారం నిర్వహించిన పెసా గ్రామసభ నిర్వాసితుల అభ్యంతరాలతో ముందుకు సాగలేదు. జేకే ఓసీ విస్తరణ కోసం సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 549లో 151 హెక్టార్ల భూమి ఓసీ ఏర్పాటుకు అవసరమైంది. ఇందులో 68 హెక్టార్లలో 52 మంది రైతులు సాగులో ఉన్నట్లు ప్రాథమిక సర్వేలో అధికారులు గుర్తించారు. 2021లో నిర్వహించిన గ్రామ సభలో నిర్వాసితుల సంఖ్య 88కి చేరింది. 2023లో నిర్వహించిన గ్రామసభలో పట్టాలు ఉన్నా లేకున్నా పరిహారం ఇస్తామని ఆర్డీఓ ప్రకటించారు. నిర్వాసితుల సంఖ్య 107కు పెరిగి తుది నివేదికలో 114గా నమోదైంది. నిర్వాసితుల సంఖ్య పెంపులో జరిగిన అక్రమాలపై అటవీశాఖ బీట్ అధికారి సస్పెండ్ అయ్యారు. అనంతరం అటవీశాఖ అధికారులు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్న వారికి మాత్రమే పరిహారం ఇస్తామని అధికారులు చెప్పడంతో ఆందోళనకు గురైన రైతులు అప్పటి కలెక్టర్ ప్రియాంక అలను ఆశ్రయించారు. జాయింట్ సర్వేకు కలెక్టర్ ఆదేశించినా నేటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు.



అధికారులను నిలదీస్తున్న నిర్వాసిత రైతులు

పట్టు వీడని రైతులు..

సర్వే నంబర్ 549లో అటవీభూమిని సింగరేణికి అప్పగించాలంటూ రెవెన్యూ అధికారులు శుక్రవారం పెసా గ్రామసభ నిర్వహించారు. జాయింట్ సర్వే చేయాలని గతంలో ఇదే విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని రైతులు గుర్తుచేశారు. జాయింట్ సర్వే చేయకుండా సింగరేణికి భూమి అప్పగింతపై సాగులో ఉన్న తమ అభిప్రాయాలు ఎందుకని రైతులు ప్రశ్నించారు. దీంతో గ్రామసభ వాయిదా వేశారా.. ముగించారా.. అని చెప్పకుండానే అధికారులు వెళ్లిపోయారు. గ్రామసభలో తహసీల్దార్ రవికుమార్, ఎఫ్ఆర్ఓ చలపతిరావు, ఎంపీఓ చిరంజీవి, ప్రత్యేకాధికారి బాలాజీ, కార్యదర్శి షర్మిల తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల సేకరణనే విజేతగా ప్రకటించాలి

కొత్తగూడెంఅర్బన్: వివిధ రకాల విత్తనాలు అధికంగా సేకరించిన పాఠశాలను జిల్లా బెస్ట్ స్కూల్ ఇన్ సీడ్ కలెక్షన్‌గా ఎంపిక చేసి చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈఓ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ అత్యధిక అటవీ రకాల విత్తనాల బరువు ప్రకారం విజేతలను నిర్ణయిస్తామని ఉత్తర్వులో పేర్కొని, కాయలు సేకరించిన పాఠశాలను బెస్ట్ స్కూల్‌గా ప్రకటించడం సరికాదని విత్తనాలు అధికంగా సేకరించిన పాఠశాలను ప్రకటించాలని కోరారు.

ప్రవక్త జీవితం మానవాళికి దిక్సూచి

కొత్తగూడెంఅర్బన్: అహేలే సున్నతుల్ జామత్, అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ కొత్తగూడెం, రామవరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం రైల్వే మసీద్ బైతుల్లా నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి హాజరై మాట్లాడారు. మతసామరస్యానికి కొత్తగూడెం ప్రతీక అని, గణేష్ నిమజ్జనం ఉండడంతో మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని నిర్వహించారని తెలిపారు. ప్రవక్త జీవితం సకల మానవాళికి దిక్సూచి అన్నారు. ఈ కార్యక్రమంలో నాగ సీతారాములు, ఎంఏ రజాక్, అమీర్ ఖాద్రి, మెహమూద్ ఖాన్, సీఐలు కరుణాకర్, శివప్రసాద్, ఫహీందాదా, మహమ్మద్ గౌస్, షమ్మీ, ఎండి గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు..



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: మత్తు పదార్థాలు వాడకం వల్ల విద్యార్థులు, యువకుల ఆరోగ్యాలు చిత్తవుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలని డీఎస్పీ చంద్రభాను కోరారు. శుక్రవారం ఇల్లెందు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెడు మార్గాల వల్ల ఇల్లు గుల్ల అవుతుందన్నారు. అనారోగ్యం బారిన పడి 20 లోనే 60కి చేరుతున్నారని పేర్కొన్నారు. కొంతకాలంగా యువతలో చెడువ్యసనాలు పెరిగిపోయాయని తెలిపారు. దురలవాట్ల వల్ల సమాజం చెడిపోతుందన్నారు. జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ వీరబాబు మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యార్థులు చదువు మీద దృష్టి సారించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. యుక్త వయస్సుల్లో మనుస్స చెడువైపు మళ్లి ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని, నిగ్రహ శక్తితో మెలగాలని సూచించారు. చట్టాలను గౌరవించాలని, విద్య, మనిషి ప్రవర్తన పెంపొందించుకునే దిశగా కొనసాగించాలని, తోటి వ్యక్తుల పట్ల ప్రేమ, అభిమానం, గౌరవం పెంపొందించాలని సూచించారు. గ్రంథాలయ పాలకురాలు రుక్మిణి, సింగరేణి స్కూల్ టీచర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుదాం..



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

సింగరేణి(కొత్తగూడెం): రాజ్యాంగ పరిరక్షణకు పోరాటడమే సీతారాం ఏచూరికి మనమిచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో మార్కిస్ట్ జాతీయ నాయకులు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ జరిగింది. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ భారతదేశ రాజకీయ యవనికపై చెరగని ముద్ర సీతారామ్ ఏచూరి అన్నారు. తాను జీవించినంత కాలం కమ్యూనిస్టుగా జీవించటమే కాకుండా తాను మరణించి కూడా కమ్యూనిస్టు ఆశయాన్ని బతికించారన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాలను సృష్టించి భారత రాజ్యాంగాన్ని లౌకిక విలువలను కాపాడడంలో లౌకిక పార్టీలన్నింటినీ ఒక తాటిమీదకి తేవటానికి తనదైన శైలిలో కృషి చేసినట్లు చెప్పారు. మనదేశం అత్యంత మేధాశక్తి కలిగిన మార్కిస్టును కోల్పోయిందన్నారు. సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన దశాబ్ది ఉత్సవాలు



వేడుకలో పాల్గొన్న నాయకులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధి హెడ్డాఫీస్ సమీపంలోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ అధ్యక్షతన సేవాలాల్ సేన దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్ జెండా ఆవిష్కరిం మాట్లాడుతూ సామాజిక న్యాయం – రాజ్యాధికారం సాధనే ధ్యేయంగా దశాబ్దకాలంగా లంబాడీ, బంజారాల మనుగడకు పదేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఎన్నో హక్కులు సాధించుకున్నట్లు చెప్పారు. ఈ ఫలితాలు మార్గదర్శకంగా ఉండాలని సమర శంఖాన్ని పూరించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ గుగులోతు శంకర్, గుగులోతు రాజేష్, బానోతు లాల్ సింగ్, బానోతు రమేష్, శంకర్‌సాధు, లావుడ్యా ప్రసాద్, హాతిరామ్, సురేష్, రేఖ్యా, రవినాయక్, మంగీలాల్, లావుడ్యా వెంకటేష్, బోడా రమేష్, బానోతు నాగరాజు, బాదావత్ సురేష్, మాలోతు అశోక్, జానకిరామ్, మోహన్ పాల్గొన్నారు.

పర్మనెంట్ కార్మికులూ 50శాతం పనిచేయాలి



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గనుల్లో కనీసం 50శాతం పర్మనెంట్ కార్మికులు కూడా బొగ్గు ఉత్పత్తిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏజీఎం మురళీధర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ సంస్థ మనుగడ, కార్మికుల సమస్యల సాధనకు బీఎంఎస్ జూలై 23 నుంచి సెప్టెంబర్ 12 వరకు కార్మిక ప్రజాందోళన కార్యక్రమాలు నిర్వహించి, ఇంకా పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎటుట ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కోలిండియా, సింగరేణి నైనీ బ్లాక్‌లను కాపాడాలని, అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ సంస్థలు (ట్రాన్స్‌కో, జెన్కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.42,739 కోట్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉంటుందని వెంటనే కంపెనీ చెల్లించాలన్నారు. అదేవిధంగా కాంట్రాక్ట్ /ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హైపవర్ వేతనాలు, ఉచిత వైద్యసేవలు, కంపెనీ క్వార్టర్, సీఎంపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, సింగరేణి సంస్థ ఈ ఏడాది సాధించిన లాభాల్లో కార్మికులకు 35శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి గుర్తింపు సంఘం వైఫల్యం కారణంగా బీఎంఎస్ కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.రామ్‌సింగ్, రామ్మోహన్, పవన్ కుమార్, సీహెచ్ మహేష్, లట్టి జగన్మోహన్, జి.వెంకటరెడ్డి, టి.నరేంద్రబాబు, మొగిలిపాక రవి, కిషన్, సైదులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించండి..

జూలూరుపాడు: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్స్‌కు పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా శుక్రవారం పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఎదుట వర్కర్లు ధర్నా నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ ధర్నాకు టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌రావు మద్దతు తెలిపారు. మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేస్తున్న డైలీవేజ్, కాంటినెంట్, పార్ట్‌టైం వర్కర్లకు పాత పద్ధతిలోనే కలెక్టర్ గెజిట్ వేతనాలు ఇవ్వాలని, జీఓ నంబర్ 64ను తక్షణమే నిలిపివేయాలన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ 2021లో ఇచ్చిన జీఓ 64ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం వల్ల కార్మికుల వేతనాలు తగ్గుతాయని చెప్పారు. 12 నెలలకు వేతనాలు చెల్లించాలని, సెలవుదినాలకు వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలని, రిటైర్డ్‌మెంట్ బెన్ఫిట్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మంగీలాల్, బానోత్ రాజు, కె.లక్ష్మి, గుమ్మడి రాజేశ్వరి, బానోత్ తులసీ, వెంకటమ్మ, భూక్యా శాంత, చంద్రు, రాధ, ఈసాల లక్ష్మి పాల్గొన్నారు.

పాల్వంచ: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్, పట్టణ కన్వీనర్ కె.సత్య అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్, గిరిజన పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు నిరవధిక సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో రాములు నాయక్, సేవ్యా, పార్వతీ, కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: కిన్నెరసానిలో సమ్మె చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల వర్కర్లు

పాల్వంచరూరల్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వేజ్ కాంటింజెంట్ వర్కర్లు సమస్యల పరిష్కారం కోసం పనులను బహిష్కరించి శుక్రవారం నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో విద్యార్థులకు భోజనాలు తయారు చేయడం ఇబ్బందిగా మారింది. కిన్నెరసాని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాల, ఉల్వనూరు బాలికల ఆశ్రమ పాఠశాల, పాల్వంచలోని ప్రీమెట్రిక్ హాస్టల్, గిరిజన బాలుర హాస్టళ్లలో మొత్తం డైలీ వేజ్ కాంటింజెంట్ వర్కర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. డైలీ వేజ్ వర్కర్లు నిరవధిక సమ్మెకు దిగడంతో టీచర్లు అష్టకష్టాలు పడి వంటలు తయారు చేసి విద్యార్థులు వడ్డించి అవస్థలు పడ్డారు. కాగా, పాల్వంచ మండలం, పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో మొత్తం 35 మంది డైలీవేజ్ కాంటింజెంట్ వర్కర్లు పని చేస్తున్నారని, 25మంది సమ్మెలో పాల్గొన్నట్లు ఏటీడీఓ చంద్రమోహన్ తెలిపారు.

ఇల్లెందురూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ వర్కర్లు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి విధులు బహిష్కరించి బొజ్జాయిగూడెంలో నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులు ఏర్పాటు చేసిన నిరసన దీక్షలో సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, రఘుబాబు, రామకల, లక్ష్మయ్య, వినయ్, మంగ, కోటమ్మ, పద్మ, లక్ష్మీనారాయణ, స్వామి, సుజాత, వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ కాంటినెంట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ మేరకు టేకులపల్లి మండలంలోని కోయగూడెం, గంగారం ఆశ్రమ పాఠశాలల వద్ద డైలీ వేజ్ వర్కర్లు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని , టైమ్ స్కేల్ అమలు చేయాలని, అప్పటివరకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు పని కల్పించాలని, పూర్తికాలం పనిచేస్తున్న వారందరికీ పూర్తి వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో డైలీ వేజ్ వర్కర్లు సమ్మె చేస్తున్నారు. వీరి సమ్మెకు సీఐటీయూ పీ ఎం హెచ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ఈసం పద్మ, కుంజ జయ సంఘీభావం తెలియజేస్తున్నామని తెలిపారు. కోయగూడెం ఆశ్రమ పాఠశాల వద్ద సమ్మెలో డైలీ వేజ్ వర్కర్లు గరిక నాగులు, దారావత్ వెంకట్రాములు, దారావత్ శ్రీను, దనసరి ఎర్రమ్మ, చీమల ధనలక్ష్మి, పూనెం బాలమ్మ, జోగ రాధ పాల్గొన్నారు.